


నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.

సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



**రిపోర్టర్లు కావలెను**

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number 9059328777



ఆంధ్రప్రదేశ్ ( క్రిష్ణ ) శనివారం 18-07-2026 సంపుటి: 01 సంచిక : 14 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Andhrapradesh(Krishna) Saturday, 18-07-2026 Volume :01 Issue: 14 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


## భారత్‌లో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ




- ఆర్‌బీఐ కీలక సన్నాహాలు
- తొలి దశలో రూ.10, రూ.20 పాలిమర్ నోట్లు
- ప్రయోగాత్మకంగా పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- 2027 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి?
- పాత నోట్లతో పాటే పాలిమర్ కరెన్సీ వినియోగం

న్యూఢిల్లీ,
ప్లాస్టిక్ కరెన్సీని భారత్‌లో ప్రవేశపెట్టేందుకు ఆర్‌బీఐ సన్నాహాలు చేస్తున్నది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రూ. 20, రూ. 10 లాంటి తక్కువ విలువ కలిగిన నోట్లను తొలి దశలో ప్రవేశపెడుతుంది. వీటిని ప్రయోగాత్మకంగా పరిశీలించి, అది పూర్తిగా విజయవంతమైతే తర్వాత పెద్ద నోట్లు విడుదలపై నిర్ణయం తీసుకుంటుంది.

-మిగతా 2 లో

## నేడే నింగిలోకి విక్రమ్-1

- ప్రయోగించనున్న హైదరాబాద్ అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్
- దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ అభివృద్ధి
- 350 కిలోల బరువు గల ఉపగ్రహాలను మోసుకెళ్లే సామర్థ్యం



2లో




### వందేమాతరం గేయానికి
## ఇక చట్టబద్ధ రక్షణ

గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష

- జాతీయ గీతంతో సమానంగా ప్రత్యేక గుర్తింపు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశానికి కసరత్తు
- ఉద్దేశపూర్వక అడ్డుతగిలితే తీవ్రమైన నేరం
- 1971 నాటి చట్టం పరిధిని విస్తరించనున్న కేంద్రం
- చట్టరూపం దాల్చితే చారిత్రక ఘట్టం

న్యూఢిల్లీ
భారత స్వాతంత్ర్య సమరంలో కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించిన అమర గేయం 'వందేమాతరం'కు ఇకపై చట్టబద్ధమైన గట్టి రక్షణ లభించనుంది. భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ప్రస్తుతం చట్టపరంగా ఉన్న గౌరవ మర్యాదలు, రక్షణలన్నింటినీ వందేమాతరం గేయానికి కూడా వర్తింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా 1971 నాటి 'జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం'కు కీలక సవరణలు చేసే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ప్రకారం.. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గేయాన్ని అవమానించినా లేదా దాన్ని ఆలపించేటప్పుడు అడ్డుతగిలి అలజడి సృష్టించినా అది తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది.

-మిగతా 2లో



## "పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన నేతలు

- భుజం సర్జరీ తర్వాత ముంబైలో కోలుకుంటున్న పవన్ కల్యాణ్
- పవన్‌ను పరామర్శించిన రఘురామ, బాలినేని, జనసేన నేతలు
- నాలుగు నెలల్లో పవన్ పూర్తిగా కోలుకుంటారని వైద్యుల వెల్లడి
- రెండు నెలల తర్వాత ఎడమ భుజానికి మరో శస్త్రచికిత్స

అమరావతి
ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భుజానికి శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం పలువురు పార్టీ నేతలు, ప్రముఖులు ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ పరామర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జనసేన పార్టీ విప్ బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, గిడ్డి సత్యనారాయణ, అరవ శ్రీధర్ సహా పలువురు సినీ నిర్మాతలు, న్యాయవాదులు ఉన్నారు. ఆయన వేగంగా కోలుకుంటుండటం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి తీవ్ర గాయం కావడంతో జూలై 11న ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగిన విషయం విదితమే.

-మిగతా 2 లో

### గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే
# నిలబెట్టింది


**గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుంది**

- నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశాం
- 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతాం
- నరసరావుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

"గత పాలనలో ఆర్థికంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వమే గాడిన పెట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కేంద్ర సహకారంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడంతో పాటు, రూ.3,216 కోట్ల రుణాలను లక్ష మందికిపైగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తూ అభివృద్ధి, ఉపాధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు."

అమరావతి
గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతో రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు.

-మిగతా 2 లో






### గుజరాత్‌లో భారీ
## ఉగ్రకుట్ర భగ్నం

- ఐదుగురు జైషే ఉగ్రవాదుల అరెస్ట్
- ఏటీఎస్ అదుపులో జైషే ముష్కరులు
- జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ
- క్రూడ్ ఐఈడీ బాంబు తయారీకి యత్నం
- ఉపా చట్టం కింద కేసులు
- పాక్ ఉగ్ర నెట్‌వర్క్ గుట్టురట్టు
- విచారణలో బయటపడిన కీలక వివరాలు

న్యూఢిల్లీ
పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహమ్మద్‌కి చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని బిలాల్ అబ్దుల్లా షే, మహమ్మద్ ఆయాజ్ కడివాలా, మహమ్మద్ షాన్‌పురి, షఫియా రయిస్ ముక్తి, మహమ్మద్ హసన్ క్రియాగా గుర్తించారు. నిందితులను మెహసానా జిల్లాలోని జ్యుడిషియల్ మెజిస్ట్రేట్

-మిగతా 2 లో



### వర్జీనియా పొగాకు
## కొనుగోళ్లు వేగవంతం

- రైతులకు మరింత గిట్టుబాటు ధర కల్పించాలి
- కంపెనీలతో చర్చించి ధరలు పెరిగేలా టొబాకో బోర్డు చర్యలు తీసుకోవాలి
- 2026-27లో ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి
రాష్ట్రంలో వర్జీనియా పొగాకు కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టొబాకో బోర్డును కోరారు. శుక్రవారం పొగాకు కొనుగోళ్ల పురోగతిపై మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్‌ఎస్వీ పొగాకు కొనుగోళ్లు, రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల వేగవంతంపై విస్తృతంగా సమీక్షించారు.

-మిగతా 2 లో



## యూరప్‌లో వేడిగాలులతో 12,000 మంది మృతి..!

- 85% మరణాలు వృద్ధులే
- మరింత పెరగనున్న మరణాలు
- హెచ్చరిస్తున్న నిపుణులు

2లో



## అమెరికా గుట్టు.. చైనా చేతికి !

- 22 కోట్ల అమెరికా ప్రజల డేటా డ్రాగన్ గుప్పిట్లో
- చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ఆరోపణలు
- అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి డ్రాగన్ ప్రయత్నం
- ఇంటెలిజెన్స్ నివేదికలు డీక్లాసిఫై చేసినట్లు వెల్లడి

2లో

### దేశ అభివృద్ధిలో రైల్వేలది
# కీలకపాత్ర

**దక్షిణ భారతదేశంలో నెం.1 రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం**

- మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం
- మంగళగిరి అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్
- ప్రధాని చేతులమీదుగా ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్ వర్చువల్‌గా ప్రారంభం

అమరావతి
దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర అని, రైల్వే స్టేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద రూ.12.56 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. దేశంలో అనేక సంస్థలు ఉన్నాయి.

-మిగతా 2 లో



## వందేమాతరం గేయానికి ఇక చట్టబద్ధ రక్షణ

మొదటి తరువాయి

పార్లమెంట్ వేదికగా చారిత్రక అడుగు

రానున్న జూలై 20 నుంచి ప్రారంభం కాబోతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ సరికొత్త సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ బిల్లు గనుక ఉభయ సభల ఆమోదం పొంది చట్టంగా మారితే, భారత న్యాయ చరిత్రలో వందేమాతరం గేయానికి ప్రత్యక్ష చట్టబద్ధమైన రక్షణ లభించడం ఇదే తొలిసారి అవుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 1971 నాటి చట్టం కేవలం భారత జాతీయ పతాకం, భారత రాజ్యాంగం, జాతీయ గీతం (జనగణమన)లకు మాత్రమే చట్టపరమైన రక్షణ కల్పిస్తోంది. ఇప్పుడు ఆ పరిధిని మరింత విస్తృతం చేస్తూ వందేమాతరాన్ని కూడా ఇందులో చేర్చనున్నారు.

ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం.. ఎవరైనా జాతీయ గీతాన్ని ఆలపించకుండా అడ్డుకున్నా, పాడే సమయంలో కావాలని గందరగోళం సృష్టించినా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా జరిమానా, లేదంటే ఈ రెండూ విధించే అవకాశం ఉంది. ఇప్పుడు తీసుకురాబోతున్న కొత్త సవరణ ద్వారా ఇదే శిక్షా నిబంధనలను వందేమాతరం గేయానికి కూడా వర్తింపజేయనున్నారు. అయితే ఈ ప్రతిపాదన చట్టరూపం దాల్చాలంటే ముందుగా పార్లమెంట్లోని లోక్‌సభ, రాజ్యసభలలో సుదీర్ఘ చర్చలు జరిగి, ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి సంతకం కావాల్సి ఉంటుంది.

రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న నిర్ణయం

గతంలో 'సెక్యులరిజం' పేరుతో పాలించిన ప్రభుత్వాలు వందేమాతరం గేయానికి ఇవ్వాల్సిన అసలైన గుర్తింపును ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని బీజేపీ దీర్ఘకాలంగా వాదిస్తోంది. భారత స్వాతంత్ర్య పోరాటంతో ఈ గేయానికి ఎంతో చారిత్రక అనుబంధం ఉన్నప్పటికీ, కొన్ని వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాల కారణంగా గత పాలకులు దీనికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ప్రస్తుత పాలక వర్గం భావిస్తోంది. ఇటీవలి కాలంలో కొన్ని ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో, కొన్ని ప్రత్యేక వర్గాల కార్యక్రమాల్లో వందేమాతరం గేయానికి ఆశించిన స్థాయిలో గౌరవం దక్కలేదనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకురాబోతున్న ఈ బిల్లులో 'అవమానం' అనే పదాన్ని ఏ విధంగా నిర్వచిస్తారనే అంశంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

### గుజరాత్‌లో భారీ
## ఉగ్రకుట్ర భగ్నం

మొదటి తరువాయి

ఆర్.ఎం భటియా ముందు గుజరాత్ ఏటీఎస్ అధికారులు హాజరుపరిచారు. ఈ ఐదుగురిని జులై 24 వరకు గుజరాత్ ఏటీఎస్ కస్టడీకి ఆర్.ఎం భటియా అప్పగించారు.

నిందితులపై ఉపా చట్టం కింద కేసు నమోదు:

గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్న జులై 3న ఏటీఎస్ టీమ్ 8 మంది ఉగ్రవాదులు చిక్కారు. ఆ ఎనిమిది మంది ముష్కరులను విచారించగా ఈ ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒకరు క్రూడ్ ఐఈడీ బాంబును తయారు చేసి, దానిని పరీక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుజరాత్ ఏటీఎస్ అధికారులు తెలిపారు. ముందస్తుగా అరెస్ట్ అయిన ఎనిమిది మందిలోని ఒకరు ముష్కరుడు ఈ బాంబు తయారీ సామగ్రి అందించినట్లు గుర్తించామని వెల్లడించారు. జైషే మహమ్మద్ తన ఉగ్ర కార్యకలాపాలను మరింతగా వ్యాప్తి చేయడానికి గుజరాత్‌లో ఒక క్రియేటివ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు నిందితులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని సెక్షన్ 13, 17, 18, 38, 39, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 148, 61 కింద కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు.

అరెస్ట్ అయిన ఐదుగురిలో ఒకరు బాంబు తయారు చేయడానికి ప్రయత్నించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంకాని కోర్టుకు తెలిపారు. అందుకే నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఏటీఎస్ కోరుతుందని చెప్పారు. బాంబు తయారీ సామగ్రి, ఉర్దూ భాషలో ఉన్న జైషే మహమ్మద్ ప్రచార సాహిత్యాన్ని సంబంధించిన పుస్తకాలను ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉందని అన్నారు. నిందితులు ఒక సాదా రం ఐఈడీ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించారని, అయి తే ఆ ప్రయత్నం విఫలమైందని వెల్లడించారు. వారు బాంబు తయారీ సామగ్రి ఎక్కడ సేకరించారు? దానిని ఎక్కడ దాచి పెట్టారు? జైషే మహమ్మద్ ప్రచార సాహిత్యానికి సంబంధించి పుస్తకాలను నిందితులు ఎలా పొందారు? అనే అంశాలపై ఏటీఎస్ దర్యాప్తు చేస్తోందన్నారు. "గుజరాత్ ఏటీఎస్ దర్యాప్తులో ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒక టీమ్ బాంబును తయారు చేయడానికి ప్రయత్నిం చినట్లు తేలింది. అతడి వద్ద జైషే మహమ్మద్ ప్రచార సాహితికి సంబంధించి పుస్తకాలు ఉన్నాయి. దాని సాయం చేసుకొని ఉంది. అంతకుముందు అరెస్ట్ అయిన ఎనిమిది మందిలో ఒకరైన అమీన్ అనే వ్యక్తి, గత అరెస్ట్ అయిన నిందితులకు బాంబు తయారీ సామగ్రి సరఫరా చేశాడు" అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంకాని పేర్కొన్నారు.

## భారత్‌లో త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ

మొదటి తరువాయి

2027 నుంచి పూర్తి స్థాయిలో ఈ పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కొత్త పాలిమర్ నోట్లతో పాటు పేపర్‌తో తయారు చేసిన కరెన్సీ నోట్లు కూడా అందుబాటులో ఉంటా యి. పాత నోట్ల స్థానాన్ని కొత్త నోట్లు భర్తీ చేయవని, రెండూ ఉనికిలో ఉంటాయని ఆర్‌బీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం కాగితంతో తయారవుతున్న సంప్రదాయ కరెన్సీ నోట్ల కన్నా ఈ పాలిమర్ నోట్లు పటిష్టంగా ఉంటాయి.

## "పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన నేతలు


మొదటి తరువాయి



ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దిన్షా పర్దివాల నేతృత్వంలో సుమారు మూడున్నర గంటల పాటు 'ఆర్థ్రోస్కోపిక్ రిపేర్ సర్జరీ' విజయవంతంగా పూర్తయింది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని జనసేన పార్టీ వర్గాలు వెల్లడించాయి. పవన్ కల్యాణ్ సంపూర్ణంగా కోలుకుని, భుజం పనితీరు సాధారణ స్థితికి రావడానికి సుమారు నాలుగు నెలల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం తీసుకుంటున్న విశ్రాంతి, నొప్పి తీవ్రతను పరిగణలోకి తీసుకుని, మరో రెండు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. 2016 నుంచి బాధిస్తున్న పాత గాయం, సినిమా షూటింగ్లు మరియు రాజకీయ ప్రచారాల కారణంగా మరింత తీవ్రం కావడంతో వైద్యులు శస్త్రచికిత్సను అనివార్యమని పేర్కొన్నారు."

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

మొదటి తరువాయి



ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులకే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్‌ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఎన్ పి ఏ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తుందని, ప్రైవేటు పెట్టుబడితో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టమని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యూరప్‌లో వేడిగాలులతో 12,000 మంది మృతి..!

**-85% మరణాలు వృద్ధులే**
**- మరింత పెరగనున్న మరణాలు**
**-హెచ్చరిస్తున్న నిపుణులు**

న్యూఢిల్లీ



శీతల ఖండం యూరప్‌లో వేడిగాలులు ప్రజల్లో వణుకు పుట్టిస్తున్నాయి. పలు దేశాలు హీట్ డోమ్ వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రచండ వేడి గాలులను తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతు న్నారు. అనేక దేశాలలో ప్రమాదకర స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణో గ్రతలు పెరుగుతుండటంతో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.ఒక్క జూన్‌లో సంభవించిన వేడిగాలులతోనే 9 యూరోపియన్ దేశాలలో కనీసం 12,000 మంది చనిపోయి నట్లు పలు గణాంకాల వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు హీట్ వేవ్‌కు తీవ్రంగా ప్రభావితమ య్యాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు మరింత తీవ్ర మవ్వడం తోదాదాపు 85% మంది 65 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు మృతి చెందారని పలు ఆరోగ్య సంస్థలు వెల్లడించా యి. ఇంకా ఈ మరణాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన వడగాడ్పులు అంతటా విస్తరిస్తుండడంతో యూరప్‌లోని అనేక ప్రాంతాలు ప్రస్తుతం తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు అనేక దేశాలలో జనజీవనం, ప్రజారోగ్యం, మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇవి మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నా యని, వీటిని సరి చేయలేక భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్‌కు చెందిన వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర

మొదటి తరువాయి

కేవలం ఒక సంస్థ మొత్తం భారతదేశాన్ని కలుపుతోంది. అదే మన రైల్వే సంస్థ. మన జీవిత ప్రయాణంలో ఎంతో ఆత్మీయ రైల్వే ప్లాట్‌ఫాంపై చేసి వస్తుంటారు, రైలు కిటికీలోంచి బయటకు చూసి ఊరైనా లేదా దేశాలైనా రైళ్లతో ఒక మధురమైన ప్రయాణం చేసి ఉంటారు. అందుకే భారతీయ రైల్వే జీవనం ఒక వ్యవస్థ మాత్రమే కాదు, అది భారతదేశ ఆత్మకు సంప్రేక్ష, సమగ్రతకు ఒకే ఒక్క సాధనం. దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ గారు రైల్వే వ్యవస్థ దేశ అభివృద్ధి చెందాలని రైల్వే అభివృద్ధి చెందాలని గతంలో దశాబ్దాల తరబడి భారతీయ రైల్వే రద్దీగా ఉండే స్టేషన్లు, అస్తవ్యస్తమైన స్తంభ, పాతబడిన మౌలిక సౌకర్యాలను మారుపు తెచ్చారు. నేడు... వందే భారత్, ఐకానిక్ రైళ్లు, 'శవన్' భద్రతా సాంకేతిక, 100 శాతం విద్యుదీకరణ, ఆధునిక సరుకు రవాణా కారిడార్లు, ఆధునీకరించిన రైల్వే స్టేషన్లు, హైడ్రోజన్ రైలు గురించి ప్రపంచం మాట్లాడుతోంది. ఇది సాధారణ ఆధునీకరణ మాత్రమే కాదు. స్వాతంత్రం వచ్చిన తర్వాత భారతీయ రైళ్లలో జరుగుతున్న అతిపెద్ద మార్పు ఇది. ఇది ఒక క్రేజీ విజయం. దేశం అభివృద్ధి చెందాలంటే రైల్వే అభివృద్ధి చెందాలనే ప్రధాని మోదీ గారు అనేక రైల్వే అభివృద్ధి పనులను, రైల్వేస్టేషన్ల అభివృద్ధిని ప్రతిష్టాత్మక బాధ్యతగా చేపట్టడం ఆనందకరం. భారతీయ రైల్వే రవాణాలో అత్యంత ఆధునీకరణ కార్యక్రమాన్ని చేపట్టడం అద్భుతమని, వేలాది కిలోమీటర్ల నూతన రైల్వే లైన్లను నిర్మిస్తున్నారు. మంత్రి... అమరావతిలో ఇన్ల్యాండ్ డ్రై పోర్ట్స్ భారతదేశానికి హై-స్పీడ్ రైళ్లు తీసుకువస్తూ, ప్రపంచ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను నిర్మించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని హైడ్రోజన్ రైలు నిరూపించింది. మన మంగళగిరి రైల్వేస్టేషన్ లో ఎక్కువ రైళ్లు ఆగేలా చూడాలని ఈ సందర్భంగా పెద్దలను కోరుతున్నా.

## వర్జీనియా పొగాకు కొనుగోళ్లు వేగవంతం

మొదటి తరువాయి

మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత నాలుగు రోజులుగా పొగాకు కొనుగోళ్లు గణనీయంగా ఊపందుకున్నాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 8.5 లక్షల కిలోల పొగాకును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గరిష్ఠంగా కిలోకు రూ. 250 వరకు ధర లభిస్తోందని, రైతులకు మరింత మెరుగైన ధర వచ్చేలా కొనుగోలు సంస్థలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డును కోరారు. ముఖ్యంగా, పొగాకు కొనుగోలు సంస్థలపై సమర్థవంతమైన ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు ఇంకా అధిక ధర లభించేలా చర్యలు చేపట్టాలని టొబాకో బోర్డు చైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుకు సూచించారు. కొనుగోళ్లు మరింత వేగవంతం కావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు.

అలాగే, తక్కువ నాణ్యత గల పొగాకును సాగు చేసిన రైతులు కూడా నష్టపోకుండా వారికి గిట్టుబాటు ధర లభించేలా కొనుగోళ్ల సంస్థలతో ప్రత్యేకంగా చర్చలు జరపాలని టొబాకో బోర్డు అధికారులకు మంత్రి ఆదేశించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 2026-27 సీజన్‌లో ఎఫ్‌ఎస్వీ పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసే దిశగా వ్యవసాయ శాఖ, టొబాకో బోర్డుతో సమన్వయం చేసుకుని రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం ద్వారా రైతులకు స్థిరమైన గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## నేడే నింగిలోకి విక్రమ్-1

**-ప్రయోగించనున్న హైదరాబాద్ అంకుర సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్**
**-దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ అభివృద్ధి**
**-350 కిలోల బరువు గల ఉపగ్రహాలను మోసుకెళ్లే సామర్థ్యం**

న్యూఢిల్లీ





భారతీయ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ శనివారం చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉన్నది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తన విక్రమ్-1 రాకెట్ మొదటి ఆర్బిటల్ లాంచ్ చేయనున్నది. ఈ మిషన్ 'ఆగమన్'లో పూర్తిగా ప్రైవేట్‌గా అభివృద్ధి చేసిన లాంచ్ వెహికల్ ఉపయోగించి పేలోడ్‌ను కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు ఈ రాకెట్ శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. "భూమిపై విక్రమ్-1ను పరీక్షించడానికి చేయగలిగినదంతా మేము చేశాం. జూలై 18న, మొదటిసారిగా నిజమైన ఫ్లైట్ వాతావరణంలో విక్రమ్-1 ఎలా పనిచేస్తుందో చూడటానికి మేం ఆసక్తిగా ఉన్నాం" అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పవన్‌కుమార్ చందన చెప్పారు.

విక్రమ్-1 అంటే ఏమిటి?

విక్రమ్-1 అనేది పూర్తిగా నాలుగు దశల ఆర్బిటల్ లాంచ్ వెహికల్. మొదటి మూడు దశలు సాలిడ్ ప్రొపల్షన్‌ను ఉపయోగిస్తాయి. నాలుగో దశ ఆర్బిటల్ ఇన్సర్షన్, ప్రిసిషన్ విన్యాసాల కోసం లిక్విడ్ ఇంజిన్‌ను ఉపయోగిస్తుంది. 350 కిలోల వరకు బరువు ఉన్న చిన్న ఉపగ్రహాలను ఎర్త్ ఆర్బిట్‌కి తీసుకెళ్లడానికి దీనిని నిర్మించారు. దీని మొదటి టెస్ట్ ఫ్లైట్ 60 డిగ్రీల వాలులో 450 కిలోమీటర్ల కక్ష్యను చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. విక్రమ్-1 భారతీయ ఎర్త్ అబ్జర్వేషన్ నానోశాటిలైట్ మేకర్ గ్రహ స్పేస్, తదితర సంస్థల నుంచి బహుళ సాంకేతిక ప్రదర్శన పేలోడ్‌లను తీసుకెళ్లనుంది.

## అమెరికా గుట్టు.. చైనా చేతికి !

**-22 కోట్ల అమెరికా ప్రజల డేటా డ్రాగన్ గుప్పిట్లో**
**- చైనాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ఆరోపణలు**
**- అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి డ్రాగన్ ప్రయత్నం**
**- ఇంటెలిజెన్స్ నివేదికలు డీక్లాసిఫై చేసినట్లు వెల్లడి**



న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాపై సంచలన ఆరోపణలు చేశారు. సుమారు 22 కోట్ల మంది అమెరికన్ ఓటర్ల వ్యక్తిగత సమాచారం చైనా చేతికి చేరిందని, ఆ డేటాను అమెరికా ఎన్నికల వ్యవస్థలోకి జోక్యానికి ఉపయోగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. జాతీయ భద్రతకు సంబంధించిన 2020 జనవరి నుంచి 2026 జూన్ వరకు ఉన్న ఇంటెలిజెన్స్ నివేదికలను డీక్లాసిఫై చేసినట్లు ప్రకటిస్తూ ఈ విషయాలను వెల్లడించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ట్రంప్.. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఎన్నికల డేటా లీక్ వెనుక చైనా పాత్ర ఉందని ఆరోపించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, రాజకీయ అనుబంధాల వంటి సున్నితమైన వివరాలను సేకరించి ఎన్నికలపై ప్రభావం చూపే ప్రయత్నం చేసిందని విమర్శించారు.

2020 నుంచే డేటా సేకరణ

2020 ఎన్నికల సమయంలోనే చైనా ఈ సమాచారాన్ని సేకరించడం ప్రారంభించిందని, ఇటీవలి వరకు ఆ ప్రక్రియ కొనసాగిందని ట్రంప్ తెలిపారు. ఈ సమాచారాన్ని ఉపయోగించి సదరు ఓటర్ల సమూహ, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

జాతీయ భద్రతకు ముప్పు

ఈ వ్యవహారం అమెరికా జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారిందని ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల డేటాను విశ్లేషించి రాజకీయ ప్రయోజనాలకు వినియోగించేందుకు చైనా ప్రత్యేక యూనిట్ను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఈ అంశంపై ఉన్న కీలక సమాచారాన్ని కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని కూడా విమర్శించారు. ట్రంప్ ఆరోపణలు అమెరికా-చైనా మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలను మరింత ప్రభావితం చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**






**దేవరకొండ జులై 17 (నేటి దర్శిని)**
దేవరకొండ నియోజకవర్గం, చింతపల్లి మండల కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందని, ప్రతి అర్హ కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్అన్నారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ రహేనా బేగం -- సిద్దిక్ బాబా దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక ఆత్మగౌరవ చిహ్నమని, ఆ గౌరవాన్ని పేదలకు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గతంలో ఎన్నో కుటుంబాలు సొంతింటి కోసం ఎదురు చూసినా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారి కలలు నిజమవుతున్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహకారంతో నాణ్యమైన ఇళ్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు


# తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూముల రీ-సర్వే అవగాహన సదస్సు



**దేవరకొండ జులై 17 (నేటి దర్శిని)**
దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండల పరిధిలోని వర్ధమానిగూడెం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భూముల రీ-సర్వే అవగాహన సదస్సులో టి పి.సి.సి. సభ్యులు డ పి .ఎ . సి. ఎస్. చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి ఎం.ఆర్.ఓ. ఎం. నరేందర్ మండల గిర్దావర్, ఆర్.ఐ. రామాంజనేయులు మండల సర్వేయర్ విజయలక్ష్మి కొండమల్లేపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసార్ల వెంకటేశ్వర్లు మండల గ్రామ పాలనా అధికారి మొహమ్మద్ హమీద్ , పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ ప్రణిత మంతు నాయక్ ,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ పాల్గొని భూముల రీ-సర్వే ప్రక్రియ, దాని ప్రయోజనాలు, రైతులు మరియు భూ యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
అలాగే గ్రామస్తులు కటి వెంకన్న, ఇస్లావత్ శ్రీను, ఇస్లావత్ శ్రీకాంత్, కటి విరయ్య, ఎస్. సైదులు, కేతావత్ శంకర్, ఇస్లావత్ రాములు, మూడవత్ మంతు, ఇస్లావత్ లక్ష్మ, మూడవత్ రమేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సర్ ప్రక్రియను ప్రతి ఓటరు తప్పనిసరిగా సమర్ధించాలి

**- డా. దూదిపాల వేణుధర్ రెడ్డి**



**దేవరకొండ జులై 17 (నేటి దర్శిని)**
తెలంగాణలో జరుగుతున్న సర్ ప్రక్రియను ప్రతి ఓటరు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని టి పి సి . సి సభ్యులు చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి పి.ఎ.సి. సి.పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వర్ధమానిగూడెం, ఫకీర్‌పురం, చెన్నెన్నిపల్లి గ్రామాలలో పర్యటిస్తూ, బిఎల్ ఓ, బి.ఎల్ ఎ. లతో కలిసి సరప్రక్రియను పరిశీలించారు. ఓటరు నమోదు, వివరాల సవరణ, అవసరమైన పత్రాల ధృవీకరణ వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. దూదిపాల వేణుధర్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్ ప్రక్రియలో పాల్గొని, తన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు ఎంతో విలువైనది” అని పేర్కొన్నారు

# మైనర్ భవిష్యత్తు కాపాడిన శక్తి బృందం..

**-ఆదోని కానిస్టేబుళ్లకు**
**ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసా పత్రాలు**

**కర్నూలు రూరల్ బ్యూరో, జులై 17 (నేటి దర్శిని)**
బాల్య వివాహాన్ని అడ్డుకుని ఓ మైనర్ బాలిక భవిష్యత్తును కాపాడిన ఆదోని శక్తి బృందం పోలీసు కానిస్టేబుళ్లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. పిల్లల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

**సమాచారం అందగానే వేగంగా స్పందన**
ఇటీవల ఆదోని మండలం ఇస్వి గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికకు బాల్య వివాహం జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో శక్తి బృందం కానిస్టేబుళ్లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయులు వెంటనే స్పందించారు. ఐసీడీఎస్,



రెవెన్యూ, ఆరోగ్య శాఖ, గ్రామ సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

**కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్**
బాలిక కుటుంబ సభ్యులకు అధికారులు, పోలీసులు కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, దీనివల్ల బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించి అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు బాల్య వివాహాన్ని విరమించుకోవడంతో మైనర్ బాలిక భవిష్యత్తు రక్షితమైంది.

**సమాచారం వెంటనే ఇవ్వాలి: ఎస్పీ**
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు, డయల్--112కు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ఘటనలపై పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సేవలకు ప్రత్యేక అభినందనలు**
పిల్లల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసి బాల్య వివాహాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన శక్తి బృందం కానిస్టేబుళ్లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయులతో పాటు సహకరించిన ఐసీడీఎస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది సేవలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మస్తాన్ వలి పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి..

**-ఏడీఏకు వినతిపత్రం సమర్పించిన ఎంపీఈవోలుసమాన పనికి**
**-సమాన వేతనం, పెండింగ్ జీతాల విడుదలకు డిమాండ్**

**ఉరవకొండ రూరల్, జులై 17 (నేటి దర్శిని)**
వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న బహుళ ప్రయోజన విస్తరణ అధికారులకు (ఎంపీఈవోలు) ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం ఉరవకొండ వ్యవసాయ డివిజన్‌లో పనిచేస్తున్న ఎంపీఈవోలు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉరవకొండ వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకుల (ఏడీఏ) కార్యాలయంలో ఏడీఏ



సత్యనారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఉరవకొండ వ్యవసాయ డివిజన్ సంఘం అధ్యక్షుడు బూదగవి గంగన్న, ఉపాధ్యక్షురాలు బండి హేమ మాట్లాడుతూ, గత 12 ఏళ్లుగా గ్రామాల్లో బహుళ ప్రయోజన విస్తరణ అధికారులుగా సేవలందిస్తున్నామని తెలిపారు. నెలకు కేవలం రూ.12 వేల వేతనం, రూ.3 వేల ఇన్సెంటివ్ మాత్రమే అందుతున్నాయని పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం కింద నెలకు రూ.35 వేల వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ట్రెజరర్ మోహన్ నాయక్‌తో పాటు పలువురు బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు (ఎంపీఈవోలు) పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో ర్యాలీలు, ధర్నాలకు కీలక ఆంక్షలు

**శ్రీ సత్యసాయి, జులై 17 (నేటి దర్శిని)**
పుట్టపర్తిలో గణేష్ కూడలి నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకు ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు నిర్వహించేందుకు అనుమతి లేదని పట్టణ సీఐ యువరాజు స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, సత్యసాయి భక్తులు, విద్యార్థులు అధిక సంఖ్యలో సంచరించే ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గణేష్ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిత్యం భక్తులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ ప్రాంతంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. అత్యవసరంగా వినతిపత్రం సమర్పించాల్సి వచ్చినా, ఐదుగురికి మాత్రమే కలెక్టరేట్‌లో అర్జీ అందజేసేందుకు పోలీసు




శాఖ అనుమతి ఇస్తుందని చెప్పారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధర్నా చౌక్‌ను వినియోగించాలని సూచించారు.

**మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు..**
అదేవిధంగా గణేష్ కూడలి నుంచి ప్రశాంతి మందిరం మీదుగా సత్యమ్మ కూడలి వరకు భారీ వాహనాలు, షేర్ ఆటోలకు అనుమతి లేదని తెలిపారు. ఈ వాహనాలు చిత్రావతి బైపాస్ మార్గాన్ని వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సీఐ యువరాజు కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, రోడ్డు భద్రత నిబంధనలు పాటించి భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# దళారులకు కాదు.. రైతు సంఘానికే పంటలు అమ్మాలి

**-రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం 10వ వార్షిక మహాసభ**
**-ఎఫ్‌పీఓల ద్వారా విక్రయిస్తే రైతులకు అధిక లాభాలు: రిజ్వానా**

**రాప్తాడు, జులై 17 (నేటి దర్శిని)**
రైతులు పండించే పంటలను దళారులకు మధ్యవర్తులకు అరా కొరా ధరలకు అమ్మ వద్దని ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్ కోఆర్డినేటర్ రిజ్వానా పేర్కొన్నారు. రాప్తాడు మండల రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ 10వ వార్షిక మహాసభను ఎం.బండమీదపల్లి హై స్కూల్ నందు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ ఎఫ్ ఎకాలజీ సెంట్రల్ ఆఫీస్ ఏ ఎల్వీ కో ఆర్డినేటర్ రిజ్వానా హాజరయ్యారు. ముందుగా మండల అధ్యక్ష కార్యదర్శి, ఎఫ్ ఫిఒ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం సమావేశంలో కోఆర్డినేటర్ రిజ్వాన ఎంటీఎల్ మల్లేష్ మాట్లాడుతూ పంట కొనుగోలు మరియు అమ్మకాల్లో దళారుల చేతుల్లో రైతులు మోసపోతూనే ఉన్నారు. అందువలన రైతుల కోసం ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్ కొత్త పద్ధతులను ప్రవేశపెట్టిందని తెలిపారు.ఈ పద్ధతులను ప్రతి రైతు తప్పకుండా పాటించాలని సూచించారు. ఎఫ్ పి ఓ రైతులకు నాణ్యమైన విత్తనాలు




అందుబాటులో లేకపోవడం సరైన యంత్ర సామాగ్రి లేకపోవడం సరైన పనిముట్లు అందుబాటులో లేకపోవడం సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం సరైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను ఒక్కొక్కరిగా పరిష్కరించుకోవడానికి సాధ్యపడదు.కాబట్టి రైతులు అందరిని ఒక తాటిపైకి తెచ్చి వారందరినీ ఉమ్మడి చేసి రైతు సంఘం ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా ఈ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం అనేది మీ అందరిదీ కాదు కనుక దీన్ని అభివృద్ధి బాటలో నడిపించాల్సిన అవసరం అందరిపైన ఉందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ కూడా వ్యాపార లావాదేవీలు నిర్వహించినప్పుడే ఈ సహకారం సంఘం అనేది లాభాల బాటలో మరియు అభివృద్ధి బాటలో నడుస్తుందని తెలియజేశారు. అంతేకాకుండా రైతు తాను పండించిన పంటను మధ్యవర్తులకు దళారీలకు మరియు వ్యాపారస్థులకు అమ్మ కూడదు.పంటను దళారులకు మధ్యవర్తులకు అమ్మడం వలన సంచికి రూ.30 నష్టపోతున్నారు. అదే రైతు సంఘం కి అమ్మితే ఆడబ్బులు మీకే వస్తాయని చెప్పారు. దళారులకు అమ్మితే తూకాల్లో మోసం చేస్తున్నారు.

RNI NO: TGTEL/25/A0471

### స్నేహితుల సర్‌ప్రైజ్‌తో

# సమంత సీమంతం..

**కుటుంబ వేడుకలో ఎమోషనల్ మూమెంట్స్ వైరల్!**



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొద్ది రోజులుగా సమంత గర్భధారణపై వార్తలు వినిపిస్తుండగా, ఇటీవల జరిగిన 'మా ఇంటి బంగారం' విజయోత్సవ కార్యక్రమంలో ఆమె బేబీ బంప్‌తో కనిపించడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లకు విరామం ఇచ్చి కుటుంబంతో కలిసి ఈ ప్రత్యేక సమయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తోంది. నటిగా వరుస విజయాలతో కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభించిన సమంతకు, ఇప్పుడు వ్యక్తిగత జీవితంలోనూ కొత్త ఆనందం చేరువైంది. కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరిగిన ఈ సీమంతం వేడుక ఆమె జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోనుంది. అభిమానులు కూడా తల్లి కాబోతున్న సమంతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు.

# అజిత్ సినిమా కీలక పాత్రలో కయాదు లోహర్ ?



అనతికాలంలోనే తారపథంలో దూసుకుపోతున్నది అస్సామీ సోయగం కయాదు లోహర్. డ్రాగన్, ఫంకీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ ప్రస్తుతం 'ది ప్యారడైజ్'లో నాని సరసన కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఆమె తమిళంలో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో అజిత్ 64వ సినిమా కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో కయాదు లోహర్ నటించనున్నట్లు తెలిసింది. కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఇదిలావుండగా సూర్య 48వ చిత్రంలో కూడా కయాదులోహర్ నాయికగా నటిస్తున్నది.




# క్వాలిటీ కథలకే ఓటేసిన కృతి సనన్..

కెరీర్ మొదలుపెట్టి పుష్కరం దాటిపోయింది. కావాల్సినంత డబ్బులు, రావాల్సినంత పేరు వచ్చేసాయి.. అయినా కూడా ఇప్పటికీ పిచ్చి పిచ్చి సినిమాలెందుకు చేయడం అంటున్నారు ఓ హీరోయిన్. వయసైపోతోందని ఏది పడితే అది చేయకుండా.. కెరీర్‌పై ఫుల్ ఫోకస్ పెడుతున్నారు. క్వాంటిటీ కాదు క్వాలిటీయే ముఖ్యం అంటున్నారామె. మరి ఇంతకీ ఎవరా ముద్దుగుమ్మ..? పుష్కరం కింద నేనొక్కడినేతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన బ్యూటీ కృతి సనన్.. ఆ తర్వాత హిందీలో టాప్ హీరోయిన్‌గా మారిపోయారు. అప్పట్లో ఖాళీగా ఉండకూడదని ఏ ఛాన్స్ వస్తే అది చేసుకుంటూ వెళ్లిన ఈ భామ.. ఇప్పుడు మాత్రం కథ నచ్చితేనే డేట్స్ ఇస్తానంటూ గట్టిగా చెబుతున్నారు. బాలీవుడ్‌లో తనకంటూ ఒక స్పెషల్ క్రేజ్ సొంతం చేసుకుని కాన్ఫిడెంట్‌గా దూసుకుపోతున్నారీమే. వచ్చిన ప్రతి సినిమాను ఓకే చేసే రోజులకి గుడ్‌బై చెప్పేసిన ఈ బ్యూటీ.. ఇప్పుడు రూట్ మార్చి క్వాలిటీకే ఓటేస్తోంది. తనకు నిజంగా కిక్ ఇచ్చే కథలనే ఎంచుకుంటూ.. రిజల్ట్ గురించి టెన్షన్ పడకుండా బిందాస్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం తన కెరీర్, లైఫ్‌లో ఎక్సైటింగ్ ఫేజ్ నడుస్తోందని తెలిపారీమే. ఇక్కడి దాకా వచ్చినందుకు ఎంతో హ్యాపీగా ఉందని ఫుల్ జోష్‌లో చెప్తున్నారు కృతి. పర్సనల్ లైఫ్‌లోనూ కృతిసనన్ తీసుకున్న ఓ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు. వయసైపోతుందేమో, త్వరగా పెళ్లి చేసుకోవాలేమో అనే టెన్షన్ లేకుండా.. కెరీర్‌పై ఫోకస్ చేయడానికే ఎగ్స్ ఫ్రీజ్ చేయించుకున్నట్లు ఓపెన్‌గా చెప్పారు. ఏ ప్రెషర్ లేకుండా ఫుల్ ఫ్రీడమ్‌తో కెరీర్‌ను ఎంజాయ్ చేస్తున్నారీమే. మొత్తానికి ఈ టైమ్‌లో తనకు క్వాంటిటీ కాదు కథల్లో క్వాలిటీ కావాలంటున్నారు కృతి.

### NBK111'


# రిలీజ్ డేట్ ఫిక్స్?

**ప్రభాస్ 'ఫౌజీ'తో క్లాష్ తప్పించుకునే ప్లాన్‌లో బాలయ్య టీమ్!**



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ చీదీఖ111 పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ హైప్ ఏర్పడింది. ముఖ్యంగా బాలయ్య స్టైలిష్ మాస్ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని కొత్త స్టైలిష్ అవతారంలో గోపీచంద్ మలినేని చూపించబోతున్నారని గ్లింప్స్ ద్వారానే స్పష్టమైంది. పవర్‌ఫుల్ యాక్షన్‌తో పాటు స్టైలిష్ ప్రెజెంటేషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సినిమా కోసం బాలయ్య అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇప్పుడు 'చీదీఖ111' విడుదల తేదీ గురించిన చర్చ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని డిసెంబర్ 25 క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సినిమాను డిసెంబర్ తొలి వారంలోనే విడుదల చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'ఫౌజీ' డిసెంబర్ 3న విడుదల కానుందని అధికారికంగా ప్రకటించడంతో మేకర్స్ తమ వ్యూహాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ప్రభాస్ సినిమాతో పోటీ పడకుండా, క్రిస్మస్ హాలిడే సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని డిసెంబర్ చివరి వారంలో విడుదల చేస్తే కలెక్షన్లకు మరింత అనుకూలంగా ఉంటుందని చిత్రబృందం భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. క్రిస్మస్ సెలవులు, అనంతరం న్యూ ఇయర్ హాలిడేస్ కలిసి రావడం వల్ల సినిమాకు లాంగ్ రన్ దక్కే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో బాలకృష్ణ మరోసారి తన మాస్ పవర్‌ను చూపించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్, బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్, హై వోల్టేజ్ ఎలివేషన్ సీన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే డిసెంబర్ 25 విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రిలీజ్ డేట్ ఖరారైతే, ఈ క్రిస్మస్ సీజన్‌లో బాలయ్య అభిమానులకు మరో భారీ సినీ పండుగ ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# గుండెజబ్బులు ఉన్నవాళ్లు సినిమాకు రావద్దు!



ఎస్‌బీకే ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై, రేగుల నీరజరాణి సమర్పణలో, ఆర్‌ఎన్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో దర్శకుడు, నిర్మాత ఎస్కే బషీద్ తెరకెక్కించిన హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'అమెన్'. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా గురించి ఎస్కే బషీద్ మాట్లాడు తూ "ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాల ట్రెండ్‌ను పూర్తిగా మార్చేలా 'అమెన్' రూ పొందించాం. సరికొత్త సస్పెన్స్, భయానక ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతు న్నాం. ఈ సినిమా ఎంత భయపెడుతుందో చెప్పలేం... గుండె జబ్బులు ఉన్నవాళ్లు థి యేటర్‌కు రావద్దు. ఒంటరిగా కూర్చుని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు. ఇది కుటుంబ సమేతంగా థియేటర్లలో ఆస్వాదించాల్సిన ఒక భయానక చిత్రం"అని అన్నారు.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450